పెన్నమ్మ పరవళ్లు



కర్ణాటకలోని విదురాశ్వత్థం వద్ద పెన్నానది ప్రవాహం

హిందూపురం అర్బన్: కర్ణాటకలోని నంది కొండల్లో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి పెన్నానది పరవళ్లు తొక్కుతోంది. జిల్లా సరిహద్దు విదురాశ్వత్థం వరకు వరద చేరింది. అక్కడి నుంచి హిందూపురం 15 కిలోమీటర్లు మాత్రమే ఉంది. నేడో, రేపో జిల్లాలోకి వరద ప్రవేశించనుంది. దీంతో జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరగా రావాలని.. పెన్నమ్మను ఆహ్వానిస్తున్నారు. పెన్నానదిలో వరద నీరు పోటెత్తుతుండడంతో జిల్లాలో ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమయ్యారు. హిందూపురం వద్ద గల పెన్నా కుముద్వతి ప్రాజెక్టు గేట్లను పరిశీలించి, మంగళవారం మరమ్మతులు చేశారు. ప్రాజెక్టులోకి నీరు చేరగానే పెద్దచెరువు, పరిగి చెరువు, కొట్నూరు చెరువు, సూరప్పకుంటకు మళ్లిస్తామని ఇరిగేషన్ డీఈ యోగానంద్ తెలిపారు.

గుండుమల చెరువు ఫుల్



మరువ పారుతున్న గుండుమల చెరువు

మడకశిర రూరల్: మండలంలోని గుండుమల చెరువు పూర్తిగా నిండి, మరువ పారుతోంది. నాలుగు రోజులగా కురుస్తున్న వర్షాలకు మండలవ్యాప్తంగా వంకలు, వాగులు, చెక్‌డ్యాంలు పొంగిపొర్లుతున్నాయి. గుండుమల చెరువు నిండి మంగళవారం మరువ పారడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కేతేపల్లి వద్ద జయమంగళి నది ఉధృతంగా ప్రవహిస్తోంది.

జిల్లావ్యాప్తంగా భారీ వర్షం

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 20: జిల్లావ్యాప్తంగా సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. అమడగూరులో అత్యధికంగా 99.0 మి.మీ. వర్షపాతం నమోదైందని వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు. కదిరి 87.2, రొళ్ల 73.4, చిలమత్తూరు 58.4, నల్లచెరువు 55.6, సోమందేపల్లి 52.4, అగళి 52.0, నంబులపూలకుంట 50.0, బుక్కపట్నం 48.8, బత్తలపల్లి 39.0, పెనుకొండ 38.8, అమరాపురం 38.6, తనకల్లు 36.4, గోరంట్ల 35.4, మడకశిర 34.6, రొద్దం 34.0, ముదిగుబ్బ 31.4, కొత్తచెరువు 31.2, గుడిబండ 29.2, ఓబుళదేవరచెరువు 28.4, ధర్మవరం 26.4, పుట్టపర్తి 25.6, కనగానపల్లి 25.2, లేపాక్షి 24.2, గాండ్లపెంట 19.2, హిందూపురం 18.4, నల్లమాడ 14.0, పరిగి 9.6, తలుపుల 9.4, రామగిరి 9.4, చెన్నేకొత్తపల్లి 5.2, తాడిమర్రిలో 3.8 మి.మీ. వర్షం కురిసిందన్నారు. జిల్లాలో సగటు వర్షపాతం 35.8 మి.మీ. నమోదైనట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

జయమంగళి గలగలలు..



ఆంధ్ర సరిహద్దులోకి ప్రవేశించిన జయమంగళి నది

హిందూపురం: ఎగువన కర్ణాటకలో కురుస్తున్న వర్షాలకు జయమంగళి నది కి వరద పోటెత్తుతోంది. వరద ప్రవాహం జిల్లాలోకి మంగళవారం సాయంత్రం ప్రవేశించింది. నది నీటిని పరిగి చెరువుకు మళ్లించారు. మోదా, చెర్లోపల్లి, గొర్రిపల్లి, ఆనందపాళ్యం, ముళ్లమోతుకపల్లి ప్రజలు.. నదికి పూజలు చేశారు. నది పరవళ్లు తొక్కుతుండడంతో జిల్లాకు చెందిన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ భూమి.. మా తాతలదే..!

ధర్మవరంలో వైసీపీ నాయకుడి దౌర్జన్యాలు





ఆక్రమిత స్థలంలో వేసిన పునాదులు

- హమాలీలకు ఇచ్చిన ఇంటి స్థలాల కబ్జా
- ఇతరులకు విక్రయం
- వంతపాడిన అధికారులు
- పొజిషన్ పట్టాల మంజూరు
- యథేచ్ఛగా నిర్మాణాలు
- గుడి, బడి, రోడ్డు స్థలం ఆక్రమణ

ధర్మవరం

మూటలు మోస్తేగానీ నాలుగు వేళ్లు నోట్లోకి వెళ్లని నిరుపేదలైన హమాలీలకు గత టీడీపీ ప్రభుత్వంలో ఇచ్చిన ఇంటి పట్టాలపై వైసీపీ నాయకుడి కన్ను పడింది. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే పేట్రేగిపోయాడు. దౌర్జన్యాలకు తెరలేపాడు. ఇళ్ల స్థలాలిచ్చిన భూమి తమ తాతలదేనంటూ హమాలీలను బెదిరించాడు. పట్టా ఉన్నా.. స్థలంలోకి రానివ్వకుండా వారిపై దౌర్జన్యాలకు దిగాడు. అలా ఐదెకరాల భూమిని తన ఆధీనంలోకి తీసుకున్నాడు. సొంతంగా సెంట్ల ప్రకారం విభజించి, ఇతరులకు విక్రయించాడు. పెద్దఎత్తున సొమ్ము చేసుకున్నాడు. వైసీపీ పాలనలో అప్పటి అధికారులు సైతం.. ఈ ఆక్రమణలకు వంతపాడారు. అక్రమంగా పొజిషన్ పట్టాలిచ్చి.. ఎంచక్కా సహకరించారు. ఇంకేముంది.. పేదల స్థలాల్లో ఇతరులు యథేచ్ఛగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. ఆ స్థలం తమదేనని తెలిసినా.. అందుకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన పట్టా ఉన్నా.. పేదలు మిన్నకుండిపోవాల్సిన పరిస్థితి కల్పించారు. ధర్మవరం పట్టణ పరిధి 1వ వార్డులోని గూడ్స్‌షెడ్ కొట్టాలలో వైసీపీ నాయకుల దౌర్జన్యాలకు పరాకాష్ట ఇది.కుణుతూరు పొలం సర్వే నంబరు 560లోని ఐదెకరాల్లో స్థలాలను కబ్జా చేసి, విక్రయించి సొమ్ము చేసుకున్నారు.

కాజేశారిలా..



పునాది మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం

పట్టణానికి చెందిన ఓ మాజీ రేషన్ షాపు డీలర్ 560 సర్వే నంబరులో ఐదెకరాల భూమి తమ తాతలకు చెందిందనీ, ఇందులో ఎవరికీ హక్కు లేదంటూ వైసీపీకి చెందిన కొందరు కార్యకర్తలను వెంటేసుకుని పట్టాలు పొందిన పేదలపై దౌర్జన్యం సాగించాడు. పట్టాలు తీసుకున్న పేదలను అక్కడికి రానివ్వకుండా బెదిరించారు. సెంట్ల ప్రకారం ఆ భూమిలోని ప్లాట్లను మరొకరికి అమ్మి, పెద్దఎత్తున సొమ్ము చేసుకున్నట్లు తెలిసింది. అప్పట్లో మాజీ ప్రజాప్రతినిధి కూడా ఆ మాజీ డీలర్‌కు వత్తాసు పలకడంతో పట్టాలు పొందిన పేదలు ఎదురించలేని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ స్థలం అయినా తమ తాతల కాలం నాటిదని చెప్పుకుని, సెంటు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు ధర నిర్ణయించి విక్రయించాడు. రూ.కోటి వరకు సొమ్ము చేసుకున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. అప్పటి తహసీల్దార్‌తో కుమ్మక్కై, దాదాపు 40 పట్టాలకు పొజిషన్ సర్టిఫికెట్లు పొందినట్లు తెలుస్తోంది. వైసీపీ నాయకుల కనుసన్నల్లో వారి నుంచి కొనుగోలు చేసిన వారు యథేచ్ఛగా నిర్మాణాలు చేపట్టారు.

ఫిర్యాదు చేసినా ప్రయోజనం శూన్యం

వైసీపీ నాయకుల భూఆక్రమణలపై సచివాలయ ఉద్యోగులకు అప్పట్లో గూడ్స్‌షెడ్‌కొట్టాల కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. దీంతో సచివాలయ ఉద్యోగులు అక్కడికి వెళ్లి పనులను తాత్కాలికంగా నిలిపి వేయించినట్లు తెలుస్తోంది. ఇది ప్రభుత్వ స్థలమనీ గుడికి,బడికి కేటాయించిన దానిని విక్రయించడానికి వీలులేదంటూ అడ్డుచెప్పారు. కొనుగోలుదారులు రెండురోజులు పనులను ఆపేసి, తిరిగి నిర్మాణాలు చేపట్టడంతో కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో తమకు న్యాయం చేకూరుతుందని ఆశిస్తున్నారు. తమ స్థలాలు ఇప్పించాలని హమాలీలు, పేదలు వేడుకుంటున్నారు.

స్థలం లాక్కున్నారు..



గత టీడీపీ ప్రభుత్వంలో మాకు ఇంటి స్థలం పట్టా ఇచ్చారు. ఇంటి నిర్మాణం చేపట్టలోపు ప్రభుత్వం మారడంతో మా కలలు కల్లలయ్యాయి. వైసీపీ నాయకులు.. ఆ స్థలంలోకి రానివ్వకుండా మమ్మలను అడ్డుకున్నారు. స్థలాలు లాగేసుకున్నారు. ప్రస్తుతం మా వద్ద పట్టా మాత్రమే ఉంది.

- ఉమాదేవి, గూడ్స్‌షెడ్‌కొట్టాల

ఇంటి పట్టా ఇప్పించండి



2018లో మాకు ఇంటిపట్టా ఇచ్చారు. ఆ తరువాత వైసీపీ అధికారం చేపట్టగానే.. మా స్థలాన్ని దౌర్జన్యంగా లాక్కున్నారు. అధికారులు స్పందించి, స్థలం ఇప్పించాలి.

- పుష్పలత, గూడ్స్‌షెడ్‌కొట్టాల

హమాలీల స్థలాలు కబ్జా

2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టణంలోని పలువురు హమాలీలకు ఇంటి స్థలాలను మంజూరు చేసింది. ధర్మవరం రూరల్ పరిధిలోని కుణుతూరు పొలం సర్వే నంబరు 560లో 5 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. అందులో అప్పట్లో 231 ప్లాట్లు వేయించి, 143 మంది హమాలీలు, 40 మందిదాకా పేదలకు ఇంటి పట్టాలను పంపిణీచేశారు. మిగిలిన 80 సెంట్ల స్థలాన్ని గుడి, బడి కోసమని కేటాయించారు. పట్టాలు పొందిన పేదలు, హమాలీలు.. ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలోపు ఎన్నికలు వచ్చి, ప్రభుత్వం మారింది. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నాయకుడి కన్ను ఇళ్ల స్థలాలపై పడింది.



కబ్జాచేసిన స్థలంలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలు

ఆధారాలతో వస్తే విచారిస్తాం

సెప్టెంబరు 1వతేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నాం. భూములు, స్థలాల కబ్జాలకు సంబంధించి, ఆధారాలతో వస్తే విచారించి, న్యాయం చేస్తాం.

- వెంకటశివరామిరెడ్డి, ఆర్డీఓ, ధర్మవరం

చైర్‌పర్సన్ రాజీనామా ఆమోదం

- ఏకగ్రీవ తీర్మానం చేసిన సభ్యులు
- 15రోజుల్లోపు కొత్త చైర్మన్ ఎన్నికకు అవకాశం



చేతులెత్తి ఆమోదం తెలుపుతున్న కౌన్సిలర్లు



అజెండా పత్రం చూపుతున్న చైర్‌పర్సన్

హిందూపురం, ఆగస్టు 20: పురం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ రాజీనామాకు ఆమోదం తెలిపారు. మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. చైర్‌పర్సన్ ఇంద్రజ అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. అజెండాలోని రాజీనామాను ఆమోదించాలని కోరారు. దీంతో సమావేశానికి హాజరైన 18 మంది సభ్యులు చేతులెత్తి ఆమోదం తెలిపారు. చైర్‌పర్సన్ రాజీనామాకు ఆమోదం లభించింది. ఇంద్రజ మాట్లాడుతూ.. వ్యక్తిగత కారణాలతో చైర్‌పర్సన్ పదవికి రాజీమానా చేశాననీ, సభ్యులు ఆమోదించాలని కోరారు. టీడీపీకి చెందిన కౌన్సిలర్ రాఘవేంద్ర సమావేశానికి గైర్హాజరయ్యారు.

చైర్మన్ ఎన్నికకు లైన్‌క్లియర్

ఇంద్రజ రాజీనామా ఆమోదించడంతో తెలుగుదేశం పార్టీ తరఫున చైర్మన్ ఎన్నికకు లైన్ క్లియర్ అయింది. ఆరో వార్డు నుంచి టీడీపీ తరఫున గెలుపొందిన డీ ఈ రమేష్‌కు చైర్మన్ పదవిని అప్పగించేందుకు ఎమ్మెల్యే బాలకృష్ణ సుముఖత వ్యక్తం చేశారు. చైర్‌పర్సన్ రాజీనామాను ఆమోదించడంతో ఇక కొత్త చైర్మన్ ఎన్నిక లాంఛనమే. ఆమోదించిన పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, సీడీఎంఏ, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు అందజేయనున్నారు. ఆ తరువాత ఎన్నికల కమిషన్ ప్రత్యేక అధికారిని నియమించాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశిస్తారు. ప్రత్యేక అధికారి నియామకం తరువాత ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఆ తరువాత ఎనిమిది రోజుల్లోపు కొత్త చైర్మన్‌ను ఎన్నుకునేందుకు అవకాశం కల్పిస్తారు. దీంతో 15రోజుల్లోపు కొత్త చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు, ఆగస్టు 20: జిల్లాలోని ప్రభుత్వ, జిల్లాపరిషత్, మున్సిపల్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ మీనాక్షి మంగళవారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు ఈనెల 26వతేదీ సాయంత్రం 5 గంటలలోగా మండల విద్యాశాఖ అధికారి, ఉప విద్యాశాఖ అధికారికి రెండు సెట్లు అందజేయాలని ఆమె సూచించారు.

ఘనంగా లక్షార్చన

పుట్టపర్తి, ఆగస్టు 20: ఒడిశా భక్తులు మంగళవారం స్థానిక సాయికుల్వంత్ సభామండపంలో సత్యసాయి లక్షార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఒడిశా భక్తులు పర్తియాత్ర పేరిట ప్రశాంతినిలయం చేరుకున్నారు. సత్యసాయి నామకృషిగానం, సత్యసాయి ప్రేమతత్వంపై పాటలు ఆలపించారు. నంతరం బాలవికాస్ చిన్నారులు సంప్రదాయ నృత్యంతో అలరించారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు



పాటలు పాడుతున్న భక్తులు

కాలుష్య కాటు!

నీటి కలుషితంతో ప్రబలిన అతిసార

మంచంపట్టిన కొంకల్లు, ఎం రాయాపురం



అతిసార బారినపడిన చిత్తప్ప

మడకశిర/గుడిబండ/రొళ్ల, ఆగస్టు 20: నీటి కాలుష్యం కాటేసింది. అతిసారం ప్రబలింది. గుడిబండ మండలంలోని కొంకల్లు, రొళ్ల మండలంలోని ఎస్ రాయాపురం గ్రామాలు మంచం పట్టాయి. ఆయా ఊళ్లలో పదుల సం ఖ్యలో జనం అతిసారం బారినపడి విలవిల్లాడుతున్నారు. గత కొన్ని రోజుల వ్యవధిలోనే కొంకల్లులో ఏడుగురు మరణించడంతో అందరూ హడలిపోతున్నారు. ఇంకా పదుల సంఖ్యలో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. దీంతో గ్రామం బోసిపోయింది. జనం బయటకు రావాలంటేనే జంకుతున్నారు. బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. 'కొంకల్లులో మరణ మృదంగం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' మంగళవారం ప్రచురించిన కథనంతో అధికారులు గ్రామానికి పరుగులు పెట్టారు. వైద్యాధికారులు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, చికిత్సలు చేశారు. పలు శాఖల ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామస్థులకు ట్యాంకర్ల ద్వారా శుద్ధి నీటిని సరఫరా చేశారు.

40 మందిదాకా బాధితులు

కొంకల్లు గ్రామంలో అతిసార కోరలు చాచడంతో గ్రామస్థులు అల్లాడిపోతున్నారు. 10 రోజులుగా వరుస మరణాలతో వణికిపోతున్నారు. 40 మందిదాకా అతిసార బారినపడ్డారు. కొంతమంది కర్ణాటక, తుమకూరు, చిక్కబళ్లాపురు, మడకశిర తదిర ప్రాంతాల్లోని ఆస్పత్రులకు వెళ్లారు. కొంతమంది కోలుకున్నారు. మరికొంత మంది ఆస్పత్రుల్లోనే ఉన్నారు. కలుషిత నీరు తాగడం వల్లే వాంతులు, విరేచనాల బారిన పడ్డామని గ్రామస్థులు వాపోతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. మురుగు ఉన్నచోట బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఎం.రాయాపురం గ్రామంలో పలువురు వాంతులు, విరేచనాలతో విలవిల్లాడుతున్నారు. సోమవారం రాత్రి 12 మందికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. మంగళవారం ఉదయం మరో 9 మందికి అయ్యాయి. దీంతో మంగళవారం గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి, చికిత్స అందించారు.

వైద్యశిబిరాలు ఏర్పాటు చేశాం



బాధితురాలిని పరీక్షిస్తున్న జిల్లా వైద్యాధికారి

కొంకల్లు, ఎస్ రాయాపురం గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి, చికిత్సలు అందిస్తున్నాం. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

- మంజువాణి, జిల్లా వైద్యాధికారి





వెండిరథంలో ఊరేగుతున్న శ్రీవారు

వైభవం.. వెండిరథ ప్రాకారోత్సవం

కదిరి: పట్టణంలోని శ్రీఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వసంత వల్లభుల స్వామి వారికి వెండిరథ ప్రాకారోత్సవం వైభవంగా నిర్వహించారు. వెండిరథంపై కొలువుదీరిన స్వామివారిని సుగంధ పుష్పాలతో అలంకరించారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రకారోత్సవం వైభంగా నిర్వహించారు.

భద్రతకు భరోసా దిశగా..

- కోల్‌కతా మహిళా డాక్టర్ హత్యాచార ఘటనతో కదలిక
- బోధనాస్పత్రిలో మహిళా డాక్టర్ల భద్రతకు చర్యలు
- ఆవరణలో వీధిలైట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు
- విశ్రాంతి గదుల్లో వసతుల కల్పనకు నిర్ణయం



డాక్టర్ల భద్రతా చర్యలపై చర్చిస్తున్న అధికారులు

అనంతపురం టౌన్, ఆగస్టు 20: వైద్యుల ఆందోళనకు ఉపశమన దిశగా జిల్లా అధికార యంత్రాంగం అడుగులు వేస్తోంది. ఈక్రమంలో వారి భద్రతకు కల్పించాల్సిన చర్యలపై చర్చలు సాగుతున్నాయి. కోల్‌కతా బోధనాసుపత్రిలో పీజీ మహిళా డాక్టర్‌పై జరిగిన హత్యాచారం పట్ల దేశవ్యాప్తంగా జూడాలు ఆందోళన బాటపట్టిన విషయం తెలిసిందే. సంఘీభావంగా జిల్లాలో కూడా జూనియర్ డాక్టర్లు విధులు బహిష్కరించి నిరసనలు చేపడుతున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా ఆస్పత్రిలో మహిళా డాక్టర్లకు అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవడానికి వైద్యాధికారులు అడుగులు వేస్తున్నారు. తన చాంబర్‌లో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓలు పద్మజ, హేమలత, ఇంజనీర్ నాయుడు, టెక్నీషియన్లతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేసి భద్రతా చర్యలపై సమీక్షించారు. ఆస్పత్రి ఆవరణలో ఉన్న బయలు స్థలాల్లో విద్యుత్ లైట్లు లేవని, అక్కడ ప్రత్యేకంగా విద్యుత్ లైట్లు వేయించాలని సూచించారు. మొత్తం మీద 20లైట్లు వేయాల్సి ఉందని ఆదేశించారు. ఆస్పత్రిలో 150 సీసీ కెమెరాలు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 110 సీసీ కెమెరాలు మాత్రమే ఉన్నాయని మిగిలినవాటిని త్వరగా ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. డ్యూటీ డాక్టర్ల విశ్రాంతి గదులలో వారికి అవసరమైన వసతులు ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని సమీక్షలో తీర్మానించారు.



అనంతలో ఆందోళన కొనసాగిస్తున్న జూనియర్ డాక్టర్లు

● **మహిళా డాక్టర్లకు బాడీ కెమెరాలు ?**

రెండురోజుల కిందట భద్రతా చర్యలపై కలెక్టరు సమీక్షించినపుడు రాత్రి పూట డ్యూటీ చేసే మహిళా డాక్టర్లకు బాడీ కెమెరాలు ఇస్తే ఎలా ఉంటుందని చర్చించినట్లు సమాచారం. ఆస్పత్రి తరపున కొనుగోలు చేసి రాత్రి డ్యూటీలో ఉండే మహిళా డాక్టర్లకు మాత్రమే అందించాలని నిర్ణయించినట్లు సమాచారం. బాడీ కెమెరాల ద్వారా ఎవరు, ఏమిటి అనేది కూడా సులభంగా తెలుసుకోవడానికి వీలు పడటంతో పాటు ఎలాంటి దాడులు, వేధింపులు జరగకుండా అరికట్టవచ్చన్న ఆలోచన చేస్తున్నారు. ఇందుకు మహిళా డాక్టర్లు ఆమోదం తెలిపితేనే వాటిని కొనుగోలు చేయాలని అధికారులు చూస్తున్నారు.

● **మత్తుపైనా ప్రత్యేక నిఘా**

వైద్య కళాశాలలో మత్తు పదార్థాల వ్యవహారాలు కొనసాగకుండా ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. ఇటీవల వెలుగు చూస్తున్న మత్తు పదార్థాల ఘటనల్లో విద్యార్థులు, మెడికోలు ఉంటున్నట్లు తెలుస్తోంది. అనంత వైద్య కళాశాలలోను ఇలాంటి వ్యవహారాలు గుట్టుగా సాగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఆర్ఎంఓలు, ఇతర వైద్యాధికారులు వీటిపై లోతుగా విచారణ చేశారు. ఓ ప్రైవేట్ వ్యక్తి రాత్రి సమయాలలో వచ్చి కొందరు మెడికోలకు మత్తు పదార్థాలు అందజేస్తున్నట్లు గుర్తించారు. ఐదారుగురు మెడికోలు మత్తుకు బానిసలైనట్లుగా నివేదిక ఇచ్చినట్లు సమాచారం. ఈవిషయంపై జిల్లా ఎస్పీకి సైతం సమాచారం ఇచ్చినట్లు ఆస్పతి వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఈనేపథ్యంలో వైద్య కళాశాలకు మత్తు పదార్థాలు సరఫరా కాకుండా గట్టి నిఘా పెట్టినట్లు సమాచారం.

వారంలోపు భద్రతా చర్యలు


ఆస్పత్రిలో రాత్రి డ్యూటీకి వచ్చే మహిళా డాక్టర్లకు అవసరమైన భద్రతా చర్యలు ఏర్పాటు చేస్తున్నాం. కలెక్టరు ఆదేశాల మేరకు ఆర్ఎంఓలు, ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించాం. అన్నిప్రాంతాలలోను వెలుతురు ఉండేలా వీధిలైట్లు ఏర్పాటు చేస్తున్నాం, అలాగే సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం, మహిళాడాక్టర్లకు బాడీ కెమెరాలు ఇవ్వాలని ఆలోచిస్తున్నాం. అయితే వీటికి మహిళా డాక్టర్లు ఆమోదం తెలపాల్సి ఉంది. మత్తు పదార్థాలు సరఫరా కాకుండా ప్రత్యేక నిఘపెట్టాలని జిల్లా ఎస్పీకి విన్నవించిన విషయం వాస్తవమే.

- డాక్టర్ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్

25న వ్యవసాయ శాఖ ఉద్యోగుల అసోసియేషన్ ఎన్నికలు

అనంతపురం అర్బన్, ఆగస్టు 20: ఉమ్మడి జిల్లా వ్యవసాయ శాఖ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 25న నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురం నగరంలోని రైతు బజార్ వద్ద ఉన్న కృషి భవన్‌లో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర కోశాధికారి శ్యాంసుందర్ శ్రీనివాస్, సహాయ ఎన్నికల అధికారిగా కృష్ణా జిల్లా అధ్యక్షుడు రమేష్, ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్‌ను నియమించినట్లు వెల్లడించారు. ఉమ్మడి అనంత జిల్లాలో పనిచేస్తున్న అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నుంచి క్లాస్‌ఫోర్ ఉద్యోగుల దాకా ప్రతిఒక్కరూ హాజరై ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు.

జీడిపల్లి రిజర్వాయర్‌కు జలకళ



బెళుగుప్ప, ఆగస్టు 20: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్ జలకళను సంతరించుకుంది. ఈ నెల 9వ తేదీన హంద్రీనీవా పథకం కింద రిజర్వాయర్‌కు రాగులపాడు ఎత్తిపోతల పథకం నుంచి కృష్ణా జలాలను వదిలారు. రోజురోజుకూ ఇన్‌ఫ్లో అధికంగా ఉండటంతో నీటిమట్టం పెరుగుతోంది. 1.68 టీఎంసీల నీటి సామర్థ్యం ఉన్న రిజర్వాయరులో ప్రస్తుతం 0.782 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మంగళవారం 1060 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు.

సవరించాకే సర్దుబాటు చేయాలి

డీఈఓకు సంఘాల నేతల వినతి

అనంతపురం విద్య, ఆగస్టు 20: పని సర్దుబాటుపై ఉపాధ్యాయుల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించిన తర్వాతే సర్దుబాటును కొనసాగించాలని ఫ్యాప్టో నేతలు డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో డీఈఓ వరలక్ష్మిని ఫ్యాప్టో నేతలు మంగళవారం కలిశారు. వారు మాట్లాడుతూ.... ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు పలు అంశాలపై విద్యాశాఖ రాష్ట్ర అధికారులకు సమస్యలపై సూచనలు చేశారన్నారు. నాయకుల అభిప్రాయాల మేరకు పునఃఉత్తర్వుల(రివైజ్డ్ గైడ్‌లైన్స్) జారీ చేశారని, అయితే జిల్లాల్లో అధికారులు అవి ఏమాత్రం పాటించడం లేదన్నారు. దీని వల్ల వందలాది మంది టీచర్లు చాలా నష్టపోతారని నాయకులు డీఈఓకు వివరించారు. గుత్తి, కుందుర్పి, బెళుగుప్ప ఎంఈఓలు సరిగా సర్దుబాటు చేయలేదని ఫిర్యాదుచేశారు. అధికారులకు ఇచ్చి అన్ని అభ్యంతరాలు సవరించిన తర్వాతే సర్దుబాటు కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఫ్యాప్టో చైర్మన్ సిరాజుద్దీన్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, ఇతర నేతలు గోవిందరాజులు, రమణారెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకటేష్, సూర్యుడు, నాగేంద్ర, రామాంజినేయులు, రత్నం, రవీంద్ర, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసులు నాయక్, వెంకటరమణ,సర్దార్‌వలి, వన్నప్ప, సుహేల్, శ్రీరాములు పాల్గొన్నారు.

24న ఉద్యోగ మేళా

కొత్తచెరువు, ఆగస్టు 20: ఉమ్మడి జిల్లాలోని అనంతపురంలో ఈనెల 24న ఉద్యోగ మేళా నిర్వహిస్తామని శ్రీసత్యసాయి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి రఘునాథరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేళా నగరంలోని కేఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతుందన్నారు. హెచ్‌సీఎల్ టెక్ కంపెనీ వారు డిజిటల్ సపోర్టు ఉద్యోగాల కోసం 2023-24లో ఇంటర్ పాసైన విద్యార్థులకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నారన్నారు. ఎంపికైన వారికి సంవత్సరానికి రూ.1.07 లక్షలు జీతం చెల్లిస్తారన్నారు.

బ్యాంకర్లు చిత్తశుద్ధితో పేదలకు సేవలందించాలి

- జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్
- అర్హులందరికీ రుణాలు అందజేయాలి: ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 20: బ్యాంకర్లు చిత్తశుద్ధితో పేదలకు సేవలందించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్తు ఆవరణలో ఉన్న డీపీఆర్‌సీ భవనంలో మంగళవారం జిల్లా సంప్రదింపుల కమిటీ, జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు కావాల్సిన రుణం సకాలంలో అందజేయాలని అధికారులను ఆదేశించారు. కేటాయించిన లక్ష్యాలను చేరుకునేందుకు బ్యాంకర్లు నిర్లక్ష్యం వీడాలని సూచించారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. బ్యాంకర్లు బాధ్యతగా పని చేసి, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి రుణాలు మంజూరు చేయాలన్నారు. బ్యాంకర్లు ప్రభుత్వ పథకాలపై కనీస అవగాహన లేకుండా సమావేశాలకు రావడం అలసత్వానికి నిదర్శనమని అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో రైతులు, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ వర్గాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలకు విరివిగా రుణాలు అందజేయాలన్నారు. బ్యాంకర్లు, ప్రభుత్వ శాఖల అధికారుల సమన్వయలోపంతో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. జిల్లాలో ప్రతి నియోజకవర్గం కేంద్రంగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో నాబార్డు అధికారులు ఉన్నారా లేదా అనే అనుమానం వస్తోందని, పథకాలను అర్హులకు అందజేయడంలో సరిగా పనిచేయడం లేదని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ అందించిన సహకారం, సమగ్ర నివేదికతో జిల్లా సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించామని, భవిష్యత్తులో మరింత నిధులు తీసుకురావడానికి కేంద్రం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. సమావేశంలో ఎల్‌డీఎం నర్సింగరావు, లీడ్ జిల్లా అధికారి గిరిధర్, జడ్పీ సీఈఓ, డీఆర్‌డీఏ పీడీ ఓబుళమ్మ, పశుసంవర్ధకశాఖ జేడీ సుబ్రహ్మణ్యం, డీఈఓ వరలక్ష్మి, హార్టికల్చర్ డీడీ నరసింహారావు, హ్యాండ్‌లూమ్ ఏడీ అప్పాజీరావు, డీఐసీ జీఎం నాగరాజురావు, నాబార్డు డీడీఎం అనురాధా, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖరాణి, ఫిషరీస్ డీడీ శ్రీనివాసనాయక్, వివిధ బ్యాంకుల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

పాలనలో విప్లవాత్మక మార్పులు రాజీవ్ ఘనతే



మాట్లాడుతున్న సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి

- సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి

మడకశిరటౌన్, ఆగస్టు 20: దేశ పాలనలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత మాజీ ప్రధాని, దివంగత నేత రాజీవ్‌గాంధీకే దక్కుతుందని సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి అన్నారు. పట్టణంలో రాజీవ్‌గాంధీ జయంతిని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ సర్కిల్లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రఘువీరారెడ్డి మాట్లాడుతూ సాంకేతిక రంగాలతో పాటు వ్యవసాయ, ఇతరత్రా రంగాలలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తెచ్చి, దేశాభివృద్ధికి రాజీవ్‌గాంధీ చేసిన కృషి మరువలేనిదన్నారు. గ్రామాల అభివృద్ధికి రాజ్యాంగాన్ని సైతం సవరించి గ్రామ పంచాయతీలకు కేంద్రం నుండి నేరుగా నిధులు వచ్చే విధంగా చేశారన్నారు. ఆయన తీసుకొన్న నిర్ణయం వల్లే గ్రామీణ ప్రాంతాలు ఎంతగానో అభివృద్ధి చెందాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కె.సుధాకర్, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మండల కన్వీనర్ మంజునాథ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

2.8కిలోల మత్తు పదార్థం స్వాధీనం



పట్టుబడిన గంజాయి, నిందితులతో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ శేఖర్

గోరంట్ల, ఆగస్టు 20: మండలంలోని గుమ్మయ్యగారిపల్లి క్రాస్ రోడ్డు వద్ద గంజాయి విక్రయిస్తున్న నలుగురిని అరెస్టు చేసి, వారి నుంచి 2.8కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పెనుకొండ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. గోరంట్లలోని రాజీవ్‌కాలనీకి చెందిన షేక్‌అష్రోజ్, జామియామసీదు ప్రాంతంలో ఉంటున్న షేక్ మహమ్మద్, మహమ్మద్‌రిజ్వాన్, మహమ్మద్‌ఇమ్రాన్‌లు గంజాయికి అలవాటు పడ్డారు. ఈక్రమంలో వారు తెచ్చుకోవడంతో పాటు ఇతరులకు విక్రయించేవారు. ఈక్రమంలో దీన్నే వృత్తిగా చేసుకుని మరికొందరితో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. అందిన సమాచారం మేరకు గోరంట్ల సీఐ శేఖర్ తన సిబ్బందితో గుమ్మయ్యగారిపల్లి కూడలిలో దాడిచేసి పైనలుగురిని పట్టుకోగా మిగిలిన వారు పారిపోయారన్నారు. వీరంతా 30ఏళ్ల లోపు యువకులని, ముగ్గురు మెకానిక్‌లుకాగా, ఒకరు వెల్డింగ్ పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. వీరు కదిరి ప్రాంతంనుంచి గంజాయిని తెస్తున్నారని, చిత్తూరు జిల్లా వ్యక్తి గంజాయి సరఫరా చేస్తున్నారని, వారందరిని వారం పదిరోజుల్లో అరెస్టు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ శేఖర్, పోలీసులు వెంకటేష్, వసంత్, రామానాయక్, రెడ్డిబాషా తదితరులున్నారు.

తాకట్టులో సర్టిఫికెట్లు

- ✦ గత ఐదేళ్లలో ప్రైవేట్ కళాశాలల నిర్వాకం
- ✦ నేటికీ కొనసాగుతున్న కనికట్టు
- ✦ అమలుకాని మంత్రి లోకేశ్ ఆదేశాలు
- ✦ మొత్తం ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్ల విడుదల

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 20: ప్రైవేట్ కళాశాలల్లో ఉన్నత విద్యాప్రవేశాలు పొందిన విద్యార్థులు వారి మునుపటి విద్యకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లను కళాశాలల యాజమాన్యాలు తాకట్టు పెట్టుకుంటున్నాయి. ఏవైనా అవసరాలకోసం వాటిని ఇవ్వాలని బతిమాలినా ఫీజు మొత్తాన్ని చెల్లించి తీసుకెళ్లాలని తెగేసి చెబుతున్నాయి. ఒరిజనల్ సర్టిఫికెట్లను తీసుకోవద్దన్న రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశాలను యాజమాన్యాలు పెడచెవిన పెడుతున్నాయి. సర్టిఫికెట్లను తాకట్టు పెట్టుకోవడం చట్టబద్ధం చేసినట్లుగా గత వైసీపీ పాలనలో కళాశాలల యాజమాన్యాలు వ్యవహరించాయి.

ప్రచార పిచ్చికి తాకట్టు

2014-19లో టీడీపీ ప్రభుత్వం విద్యార్థుల ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను కళాశాలల ఖాతాలకే జమజేసింది. ఫీజులకు సర్టిఫికెట్లకు ఎలాంటి లింకు పెట్టలేదు. అయితే వైసీపీ పాలనలో సీన్ రివర్స్ అయింది. అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి సొంత ప్రచారం చేసుకునేందుకు ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను తానే ఇస్తున్నట్లు విద్యాదీవెన, వసతి దీవెనల పథకాలుగా పేర్లు మార్చారు. కళాశాలలకు చెల్లించాల్సిన మొత్తాలను విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాలకు జమచేస్తూ వచ్చారు. ఈ అంశంపై కళాశాలల యాజమాన్యాలు పలుమార్లు రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేశాయి. ఒకేసారి చెల్లించాల్సిన ఫీజులను సంవత్సరంలో నాలుగు సార్లు ఇవ్వడంతో విద్యార్థులు కట్టలేకపోతున్నారని, ఇలాగైతే కళాశాలలు నడపలేమని తేల్చిచెప్పాయి. ఈ నేపథ్యంలో ప్రవేశాల పొందే సమయంలోనే ఫీజుల గ్యారెంటీగా తమ పిల్లల ఒరిజనల్ సర్టిఫికెట్లను తాకట్టు పెట్టుకోవడం రివాజు మారిపోయిందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

లక్షలాది మంది సర్టిఫికెట్లు

జేఎన్‌టీయూ పరిధిలో 69 బీటెక్, 39 బీఫార్మసీ, ఎస్కేయూ అనుబంధంగా 60 డిగ్రీ, 9 పీజీ, ఆరు పాలిటెక్నిక్ మొత్తం 183 ప్రైవేట్ కళాశాలలున్నాయి. వీటిలో దాదాపు 2లక్షలకు పైగా విద్యార్థులు చదువుతున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. వీరందరి సర్టిఫికెట్లు ఆయా కళాశాలల యాజమాన్యాలు తాకట్టు పెట్టుకున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులే సొంతంగా కళాశాలలకు ఫీజులు చెల్లించి వారి పిల్లల సర్టిఫికెట్లను విడిపించుకుంటున్నారు. సంబంధిత కోర్సులు పాసైనా ఆర్థిక స్తోమతలేక ఫీజులు కట్టలేదని, దీంతో నేటికి తమ సర్టిఫికెట్లు కళాశాలల్లోనే ఉండిపోయాయని పలువురు విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు.

భద్రతకు భరోసా లేదు

పాలిటెక్నిక్ ప్రవేశాలకు పదో తరగతి మార్కుల జాబితా, బీటెక్, డిగ్రీ, బీఫార్మసీ అడ్మిషన్స్‌కు పదితోపాటు ఇంటర్, పీజీ ప్రవేశాలకు పది, ఇంటర్, డిగ్రీ ఒరిజనల్ మార్కుల జాబితాలను ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తాకట్టు పెట్టుకుంటున్నాయి. మీ ఫీజులు చెల్లించేంత వరకు సర్టిఫికెట్లు మావద్ద ఉంటాయని చెబుతున్నాయి. ఏ సెమిస్టర్‌కు ముందు ఆ సెమిస్టర్ ఫీజు కట్టాలి. లేకుంటే హాల్‌టికెట్లు కూడా ఇవ్వరు. విద్యాభ్యాసం చివరి సంవత్సరంలో సంబంధిత కోర్సు మార్కుల జాబితాలను తీసుకెళ్లేముందు మొత్తం ఫీజులు చెల్లించాలి. కోర్సు కాలంలోపు మీకేదైనా జరిగినా. కళాశాలకు రాకున్నా, ఇతర కారణాలేవైనా మా ఫీజులు ఎవరు కడతారు?. అందుకే మీ ఒరిజనల్ సర్టిఫికెట్లను తాకట్టు పెట్టుకుంటున్నామని యాజమాన్యాలు చెబుతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. విద్యాభ్యాసం పూర్తి అయ్యేవరకు తమ సర్టిఫికెట్లకు భరోసాలేదని, అనేక మంది విద్యార్థుల సర్టిఫికెట్లను పోగొట్టారని మండిపడుతున్నారు. ఈ సమస్యను టీడీపీ దృష్టికి తీసుకెళ్లడంతో సర్టిఫికెట్లకు లింక్‌లేకుండా నేరుగా కళాశాలలకే ఫీజులు చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

సర్టిఫికెట్లు తీసుకోవడం నేరం



యూజీసీ మార్గదర్శకాల మేరకు ఒరిజనల్ సర్టిఫికెట్లను కళాశాలల్లో పెట్టుకోవడం నేరం. 2020-23 విద్యాసంవత్సరాల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థుల ఒరిజనల్ సర్టిఫికెట్లును కళాశాలలు తీసుకున్నట్లు ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. దీంతో ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి ఎటువంటి ఒరిజనల్ సర్టిఫికెట్లు తీసుకోవద్దని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు కళాశాలల యాజమాన్యాలతో సమావేశాన్ని నిర్వహించి హెచ్చరికలు జారీచేశాం. తాకట్టుపెట్టుకున్న కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటాం. జేఎన్‌టీయూ వెబ్‌సైట్‌లో హెల్ప్‌డెస్క్ ద్వారా విద్యార్థులు ఫిర్యాదు చేయవచ్చు.

- ప్రొఫెసర్ సుదర్శన రావు, జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ

క్రిమినల్ కేసులు పెట్టిస్తాం



విద్యార్థుల ఒరిజనల్ సర్టిఫికెట్లు తీసుకున్న కళాశాలలపై క్రిమినల్ కేసులు పెట్టిస్తాం. గడిచిన సంవత్సరాల్లో ఇలాంటి వాటికి పాల్పడిన కళాశాలల యాజమాన్యాలను హెచ్చరించాం. ఈ విద్యాసంవత్సరంలో ఎవరైనా ఒరిజనల్ సర్టిఫికెట్లను తీసుకుంటే వర్సిటీ అనుబంధ గుర్తింపును రద్దుచేస్తాం. అడ్మిషన్స్ రూల్స్‌ను పాటించి అందుకు అవసరమైన సర్టిఫికెట్లను మాత్రమే తీసుకోవాలి.

- ప్రొఫెసర్ అనిత, ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ

ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలి

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

అనంతపురం అర్బన్, ఆగస్టు 20: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించేలా అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. ఏపీ సచివాలయం నుంచి వ్యవసాయ శాఖ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రాజశేఖర్, వ్యవసాయ శాఖ కమిషనర్ డిల్లీరావులతో కలిసి మంగళవారం ఆయన రాయలసీమ జిల్లాల వ్యవసాయ అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాకు ఉలవలు, అలసంద, పెసర, జొన్న, కొర్ర విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. అర్హులైన రైతులకు విత్తనాలు పంపిణీ చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీసీలో జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, శాస్త్రవేత్తలు జాన్సన్, విజయశంకర్‌బాబు, మల్లేశ్వరి, నారాయణస్వామి, ఏడీఏలు, ఏఓలు పాల్గొన్నారు.

పోట్లాట!

- కడప సెక్రటరీ వర్సెస్ అనంత ప్రెసిడెంట్
- ఫుట్‌బాల్ అసోసియేషన్‌లో కోల్డ్‌వార్
- అసౌకర్యాలతో క్రీడాకారుల అవస్థలు
- జాతీయ ఫుట్‌బాల్ పోటీల వేదికగా విభేదాలు బహిర్గతం



జాతీయ ఫుట్‌బాల్ బాలికల మ్యాచ్ ప్రారంభోత్సవంలో కలెక్టర్ వినోద్‌కుమార్, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 20: ఫుట్‌బాల్ అసోసియేషన్‌లో కోల్డ్‌వార్ నడుస్తోంది. నగరంలోని ఆర్డీటీ స్టేడియంలో గత మూడు వారాలుగా నిర్వహిస్తున్న జాతీయ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ 2024-25 పోటీల వేదికగా విభేదాలు బహిర్గతమయ్యాయ. పోటీలకు జాతీయ ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ, రాష్ట్ర అధ్యక్షుడు కోటగిరి విద్యాశ్రీధర్ హాజరవుతారని చెప్పారు. నిర్వాహకులైన ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ, కడప జిల్లా సెక్రటరీ డేని యల్ ప్రదీప్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, అనంతపురం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ మధ్య విభేదాలు, సమన్వయలోపంతో ఆయనకు ఆహ్వానం పంపలేదని సమాచారం. ఈక్రమంలోనే ప్రారంభ వేడుకల్లో సైతం ఎవరికి వారుగా వేర్వేరుగా ఇద్దరూ ఉండి పోయారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్, జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ కూడా అలా వచ్చి ఇలా వెళ్లి పోయారు. అంతా ఫొటోలకు ఫోజులిచ్చేవరకు ఉన్నారు. ముఖ్య అతిథులు వెళ్లిపోగానే గ్రౌండ్ మొత్తం ఖాళీ అయిపోయింది. ఇక అప్పటి నుంచి క్రీడాకారులకు సరైన భోజనం, వసతి అందడం లేదు. సమస్య ఎవరికి చెప్పుకోవాలో దిక్కుతోచక క్రీడాకారులు మిన్నకుండిపోయారు. ప్రధాన నిర్వాహకులు డేనియల్ ప్రదీప్, వేణుగోపాల్‌లు మైదానంలో కనబడరు. ఒకరిపై ఒకరు నెట్టుకుంటూ క్రీడాకారులను సమస్యల్లోకి నెట్టేశారు. సరైన షెడ్యూల్, ప్రోగ్రామింగ్ లేక పోటీల నిర్వహణ సైతం ఆలస్యంగా జరుగుతోంది. సెమీస్ పోటీల్లో ఎవరితో ఎవరు పోటీ పడాలో అర్థం కాని పరిస్థితుల్లో జట్ల మధ్య విభేదాలు సృష్టించారు. ఇక సెమీస్ పోటీలు జరిగిన ఆదివారం క్రీడాకారులకు సరైన భోజనం లేక పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పోటీలకు సంబంధించి విరాళాలు కూడా ఎవరికివారు వేర్వేరుగా వసూలు చేసినట్లు సమాచారం. దీనిపై జాతీయ ఫెడరేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు పలువురు సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. జాతీయ పోటీల వేదికగా తమకు కలుగుతున్న అసౌకర్యాలపై పలురాష్ట్రాల క్రీడాకారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిర్వహణ తీరు సక్రమంగా లేదని ఏపీ, జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్లపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కడప, అనంతపురం అధ్యక్ష, కార్యదర్శులు మధ్య తలెత్తిన మనస్పర్థలు, ఆధిపత్య పోరుతో ఇలా చేయడం దారుణమని పలువురు పేర్కొంటున్నారు. ఆయారాష్ట్రాల క్రీడాకారులు, మేనేజర్లు ఇక్కడ జరుగుతున్న వాస్తవాలను జాతీయ ఫుట్‌బాల్ ఫెడరేషన్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పినట్లు సమాచారం.



సమావేశంలో మాట్లాడుతున్న సీఏఎఫ్ ఫౌండేషన్ జిల్లా ప్రతినిధి కొండప్ప

మొబైల్ వినియోగంపై అవగాహన

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 20: మొబైల్ వినియోగం-పిల్లల భవిష్యత్తు అనే అంశంపై అవగాహన సదస్సును స్థానిక శ్రీశక్తి భవన్‌లో మంగళవారం నిర్వహించారు. ఇందులో వక్తలు మాట్లాడుతూ... మొబైల్ ఫోన్లను మంచి విషయాలపై పరిజ్ఞానం పెంపొందించుకోవడానికి మాత్రమే వినియోగించాలన్నారు. ఆన్‌లైన్ మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏ పిల్లలు అయితే ప్రేమ ఆప్యాయత, అనురాగం, తల్లిదండ్రుల వద్ద నేర్చుకుంటారో.. ఆ పిల్లలే సమాజంలో మంచిపౌరులుగా రాణిస్తారన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు చదువుతో పాటు సంస్కారమూ నేర్పించాలని సూచించారు. ఈ దిశలో సమాజంతో నేరుగా సంబంధాలున్న మతగురువులు, పెద్దలు, మెప్మా సిబ్బంది, డ్వాక్రా సంఘాలు, ఆర్పీలు సమాజంలో అవగాహన తీసుకొనిరావాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో మెప్మా అధికారిణి రమాదేవి, శిశుగృహ మేనేజర్ సునీత, ఐసీపీఎస్ సోషియల్ వర్కర్ వనజాక్షి, ప్రభుత్వ ఖాజీల అసోషియేషన్ అధ్యక్షుడు అన్సార్‌బాషా, రాళ్ళపల్లి బాబాసాహెబ్, సీఏఎఫ్ అంబాసిడర్ భరత్, కావేరి, డ్వాక్రాసంఘాల ఆర్పీలు పాల్గొన్నారు.

ఆర్టీసీ కండక్టర్ నుంచి రక్షణ కల్పించండి

ధర్మవరంరూరల్, ఆగస్టు 20: ధర్మవరం డిపోలోని ఆర్టీసీ కండెక్టర్ రమణప్ప గతంలో వైసీపీ నాయకుల అండతో తమ కుటుంబంపై కక్ష్య పెంచుకున్నాడని, తమను చంపుతామని బెదిరిస్తున్నాడని పట్టణంలోని కోటకురుబవీధికి చెందిన సాకే లలిత, కుళ్లాయప్ప దంపతులు వాపోయారు. అతని నుంచి తమకు ప్రాణహాని ఉందని మంగళవారం వారు పట్టణ వన్ టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తాము టైలర్‌షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నామని, రమణప్ప నెల క్రితం తమ షాపు వద్దకు వచ్చి నానా దుర్భాషలాడుతూ చంపుతామని బెదిరించారని వాపోయారు. వైసీపీ నాయకుల అండతో తమపై అనవసరంగా కేసులు నమోదు చేయించారని వాపోయారు. రమణప్ప నుంచి తమకు ప్రాణహానికి ఉందని, ఆయనపై చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదని, దీంతో పట్టణ వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారని తెలిపారు. రమణప్పపై చట్టరీత్యా చర్యలు తీసుకోని తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

23న ఉపాధి హామీ గ్రామసభలు

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 20: మండలంలోని 14 పంచాయతీల్లో ఉపాధి పథకం 2024-25 ఆర్థిక సంవత్సరానికి కొత్త పనులను ఎంపిక చేయడానికి ఈనెల 23న గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వరలక్ష్మీ, కార్యాలయ పర్యవేక్షకులు పూల రెడ్డెప్ప మంగళవారం తెలిపారు. కూలీలు, మేట్లు, సమ శక్తిసంఘాల సభ్యులు, గ్రామ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజలు పాల్గొని కొత్త పనులను ఎంపిక చేయడానికి ఈ గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు.

నల్లచెరువు: జాతీయ ఉపాధి పథకంలో కొత్త పనుల ఎంపిక కోసం ఈనెల 23న మండలంలోని 13 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శకుంతల మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామసభలు గురించి ప్రజలకు తెలియచేయాలన్నారు. ఈ గ్రామసభలకు సచివాలయ సిబ్బంది, ఉపాధి కూలీలు, ప్రజలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరుకావాలని కోరారు.

తనకల్లు: మండలంలోని పంచాయతీల్లో ఈనెల 23న నిర్వహించే గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటరమణ మంగళవారం పేర్కొన్నారు. ఉపాధి పథకానికి సంబంధించిన పనులను గ్రామస్థుల సమక్షంలో ఎంపిక చేస్తామన్నారు. రైతులు, కూలీలు, ప్రజలు తమకు అవసరమైన పనులను ప్రతిపాదించి గ్రామ సభలో తీర్మాణాలు పొందాలని సూచించారు. పండ్లతోటలు, గడ్డి, పూలతోటల పెంపకం, నర్సరీల ఏర్పాటు, పంట కాలువల మరమ్మతులు, కాలువల్లో పూడికతీత, పొలాలకు మట్టితరలించటం, భూమి చదును చేయుట, ఫారంపాండ్లు, కొత్తకుంట నిర్మాణాలు, పాతకుంటల మరమ్మతులు, అటవీ అభివృద్ధి తదితర అంశాలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు.

సర్దుబాటుపై ఉపాధ్యాయుల నిరసన

గాండ్లపెంట, ఆగస్టు 20: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టారని పలువురు ఉపాధ్యాయులు స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన చేపట్టారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ... ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా జూనియర్ ఉపాధ్యాయులను కౌన్సెలింగ్‌లో చూపించడం సరికాదన్నారు. సీనియర్లు ఉన్నారని, వారితో సర్దుబాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సిద్దారెడ్డి, ముంతాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ విషయంపై ఎంఈఓ క్రిష్ణానాయక్‌ను వివరణ కోరగా.. ప్రభుత్వం నిబంధనల మేరకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేశామన్నారు.

ఉపాధ్యాయులకు అన్యాయం

నంబులపూలకుంట : పనిసర్దుబాటులో ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. మండలస్థాయి పని సర్దుబాటులో ఎస్‌జీటీ ఉపాధ్యాయులను బలవంతంగా ఉన్నత పాఠశాలలకు కేటాయిస్తున్నారని, ఉపాధ్యాయుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకపోవడం సరికాదని అన్నారు. 21 మంది విద్యార్థులుంటే ఇద్దరు ఎస్‌జీటీ ఉపాధ్యాయులు విధులు నిర్వహించాలని, కాని ఒక ఉపాధ్యాయుడినే నియమిస్తున్నారని మండిపడ్డారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

కదిరి అర్బన్, ఆగస్టు 20 : మాజీ ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను మంగళవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఇందిరాగాంధీ సర్కిల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో కదిరప్ప, ఉపేంద్ర, భాస్కర్, తిప్పన, సాయి, దేవ పాల్గొన్నారు.



రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఇండస్ ఇండ్ బ్యాంక్ సహకారంతో అభివృద్ధి పనులు

నంబులపూలకుంట, ఆగస్టు 20: వెనుకబడిన నంబులపూలకుంట మండలంలో ఇండస్ ఇండ్ బ్యాంక్ సహకారంతో ఎఫ్ఈఎస్ ఆధ్వర్యంలో రూ.3.99 కోట్లతో అభివృద్ధి పనులు చేపడతామని ఆ బ్యాంక్ ప్రతినిధి అక్లాక్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని తిమ్మమ్మ మర్రిమానులో స్కేల్ ప్రాజెక్టును ప్రారంభించిన ఆయన మాట్లాడారు. మూడు సంవత్సరాల పాటు మండలంలోని 14 పంచాయతీల్లో పల్లె సంఘాల ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఈ గ్రామాల్లో పశువుల తాగునీటి గుంతలు, చెరువుల మరమ్మతులు చేపడతామన్నారు. బలిజపల్లి పంచాయతీ పరిధిలోని కెవి. బురుజు, అరవవాండ్లపల్లి గ్రామాల్లో పశువుల తాగునీటి కోసం గుంతలు తవ్వే పనులకు భూమిపూజ చేశామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేంద్రకుమార్, గాండ్లపెంట, తలుపుల, ఎన్పీకుంట మండలాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎఫ్ఈఎస్ సిబ్బంది, ప్రాజెక్టు మేనేజర్లు అరుణ, లింగమూర్తి, గిరిజ గణేష్, ఇంజనీర్లు మోహన్ సంధ్య, పల్లె సంఘం లీడర్లు, ప్రజలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇండస్ ఇండ్ బ్యాంక్ ప్రతినిధి అక్లాక్

దోషులను నడిరోడ్డుపై ఉరితీయాలి



ధర్మవరంలో కొవ్వొత్తులతో జనసైనికుల ర్యాలీ



ఓడీసీలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ధర్మవరం, ఆగస్టు 20 : కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై అత్యాచారం, హత్య కేసులో దోషులను నడి రోడ్డుపై ఉరి తీయాలని జనసేన నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. మంగళవారం ఎన్టీఆర్ సర్కిల్ నుంచి కాలేజ్ సర్కిల్ వరకు కొవ్వొత్తుల నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. మహిళలకు రక్షణ కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టమైన చట్టాలు తీసుకువచ్చి అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు బెస్త శ్రీనివాసులు, రాజారెడ్డి, అడ్డగిరి శ్యాంకుమార్, వెంకటరెడ్డి, సరితాల దస్తగిరి, బాలక్రిష్ణ, శ్యాముల్ పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసి, హత్య చేసిన దోషులను నడిరోడ్డుపై ఉరి తీయాలని విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్ మీదుగా పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్, ఓడీసీ యువసైన్యం లడ్డు బాబ్‌జాన్, ఆర్పీ, జహీర్, ఆసీఫ్, హర్షిద్, వెలుగు ఏపీఎం రమణప్ప, సీసీలు, పశువైద్యాధికారి ప్రవీణ్ కుమార్, సిబ్బంది, ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు జయసింహారెడ్డి, పిట్టా శివశంకర్‌రెడ్డి, మస్తాన్, ఎస్‌వీవీ కళాశాల ప్రిన్సిపల్ జీసీ రామక్రిష్ణ, పీడీ గోపీనాథ్, సుమంత్, ప్రభుత్వ, ప్రయివేటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : వైద్యురాలిపై హత్యాచారం, హత్యను నిరసిస్తూ ఆర్డీటీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల నుంచి కాలేజీ సర్కిల్, టవర్‌క్లాక్ మీదుగా, అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్ర మంలో ఎస్ఐ బాబ్‌జాన్, ఆర్డీటీ సిబ్బంది లక్ష్మణ, పాఠశాల పీడీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బత్తలపల్లి: వైద్యురాలిని అత్యచారం చేసి హత్యచేసిన నిందితులను వెంటనే శిక్షించాలని బత్తలపల్లిలో మంగళవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఆర్డీటీ ఆసుపత్రి నుంచి విద్యార్థులతో కలిసి నాలుగు రోడ్ల కూడలి వరకు నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏటీఎల్ రుక్మంగాద, శోభారాణి, మురళి, నాగరాజు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మహిళా వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేయడంపై స్థానిక బస్టాండ్ కూడలిలో మంగళవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో మానవహారంగా ఏర్పడి, కొవ్వొత్తులతో దాదాపు 200 మంది నిరసన తెలిపారు. దీనికి సీపీఐ మద్దతు పలికింది. ఇందులో ఆర్డీటీ ఏటీఎల్ కృష్ణ, ముదిగుబ్బ వైద్యాధికారి శ్వేత, సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు, డిగ్రీ కళాశాల విద్యార్థులు, కస్తూర్బా పాఠశాల విద్యార్థులు, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లమాడ : మండల కేంద్రంలోని ఆర్డీటీ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్డీటీ ఏటీఎల్ వన్నూరప్ప, సీఓ శ్రీనివాసులు, సిబ్బంది గంగప్ప, నరసింహులు, కుళ్లాయమ్మ, అనిత, అధ్యాపకులు, కస్తూర్బా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బత్తలపల్లిలో నినాదాలు చేస్తున్న ఆర్డీటీ సిబ్బంది



ముదిగుబ్బ బస్టాండ్ కూడలిలో మానవహారం



నల్లమాడలో విద్యార్థుల ర్యాలీ



అలంకరణలో రాఘవేంద్రస్వామి

ఆరాధనోత్సవాలు ప్రారంభం

ధర్మవరం, ఆగస్టు 20 : పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలోని శ్రీరాఘవేంద్రస్వామి ఆలయంలో స్వామివారి 353వ ఆరాధన మహోత్సవాలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలు మూడు రోజులపాటు నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త పద్మనాభ ఆచారి తెలిపారు. మొదటిరోజు పూర్వ ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. పంచామృతాభిషేకం, కనక మహాపూజ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అదే విధంగా మార్కెట్‌యార్డ్ వద్ద ఉన్నమారుతీ రాఘవేంద్రస్వామి ఆలయంలో కూడా స్వామివారి ఆరాధనోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సుబ్బారావు, పోలా ప్రభాకర్ పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ పవిత్రోత్సవాలు

ధర్మవరం, ఆగస్టు 20 : స్థానిక కొత్తపేటలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు మంగళవారంతో ముగిశా యి. చివరి రోజు ఉదయం అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు వేదమంత్రాలు, మంగళవాయుద్యాల నడుమ నిర్వహించారు. అనంతరం నిత్యహోమాలతో పాటు వివిధ అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవిత్ర సమర్పణ, మహా పూర్ణాహుతితో ఈ ఉత్సవాలు ముగిశాయి.



అలంకరణలో స్వామి, అమ్మవార్లు

ఈద్గా స్థలాన్ని ఎవరూ కబ్జా చేయలేదు



మాట్లాడుతున్న మైనారిటీ నాయకులు

పుట్టపర్తి, ఆగస్టు 20: పెడపల్లి ఈద్గా స్థలాన్ని ఎవరూ కబ్జా చేయలేదని, ఆ స్థలం రోడ్డు విస్తరణలో పోయిందని పెడపల్లి ముస్లిం మైనారిటీ నాయకులు రఫీ, గౌస్‌మోద్దీన్, మున్నా, బాబ్జాన్, మహబూబ్‌బాషా, అంజు స్పష్టం చేశారు. మంగళవారం వారు పుట్టపర్తిలో మాట్లాడుతూ... మండలంలోని పెడపల్లిలో సర్వే నెంబరు 139లో 54 సెంట్లలో ఈద్గాను నిర్మించుకొని ప్రార్థన చేసేవారమని, ఇటీవల రోడ్డు విస్తరణలో ఈద్గా స్థలమంతా రోడ్డుకు పోవడం జరిగిందని అన్నారు. ప్రక్కనే ఉన్న స్థలంలో ఈద్గాను నిర్మించుకోవడానికి భూమి పూజ చేసామని, కొంతమంది మాజీ సర్పంచు శ్రీరాంనాయక్ కబ్జా చేశారని విష ప్రచారం చేస్తున్నారని, ఇందులో ఎలాంటి వాస్తవమూ లేదని అన్నారు. ఇదే విషయాన్ని ఆర్డీఓ భాగ్యరేఖకు, తహసీల్దార్ అనుపమకు లిఖితపూర్వకంగా తెలియచే శామన్నారు. గ్రామంలో మైనారిటీల మధ్య వైషమ్యాలు విభేదాలు సృష్టించేందుకు కొంతమంది ఇలా విష ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి



విజయలక్ష్మి (ఫైల్)

ధర్మవరం, ఆగస్టు 20 : పట్టణంలోని శివానగర్‌కు చెందిన విజయలక్ష్మి (60) అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మరణించింది. ఆమె మోకాళ్ల నొప్పులతో గత కొంతకాలంగా తీవ్రంగా బాధపడుతోంది. ఆ నొప్పులు భరించలేక శుక్రవారం సాయంత్రం అధిక మోతాదులో మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ.. సోమవారం రాత్రి మరణించింది. కేసు దర్యాప్తులో ఉన్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు...

కదిరి అర్బన్ : కదిరి, అనంతపురం రహదారి ఎరుకులవాండ్లపల్లి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని మంగళవారం ఓ వృద్ధుడు మరణించాడు. ఎరుకులవాండ్లపల్లికి చెందిన వెంకటరమణ (65) వ్యవసాయ కూలీ. మంగళవారం రాత్రి గ్రామం వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటరమణ అక్కడిక్కడే మరణించాడు. రూరల్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆరు నెలలుగా.. తీరని దాహం..!



చౌటకుంటపల్లి శివారులోని పశువుల తొట్టెలో నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్థులు

- చౌటకుంటపల్లిలో దుస్థితి
- గుక్కెడు నీటి కోసం పాట్లు
- కొత్త బోరు వేసి నెలలు గడుస్తున్నా అందని నీళ్లు
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు
- సమస్యపై 'పంచాయతీరాజ్' కాలయాపన

నల్లమాడ, ఆగస్టు 20: మండలంలోని చౌటకుంటపల్లిలో గుక్కెడు నీటి కోసం గ్రామస్థులు పడరాని పాట్లు పడుతున్నారు. ఆరు నెలలుగా ఈ గ్రామంలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. గ్రామంలో నాలుగు వందల కుటుంబాలు ఉన్నాయి. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ఇరుపార్టీల నాయకులు ట్యాంకర్లతో ఈ గ్రామానికి నీటిని సరఫరా చేశారు. ఎన్నికలు పూర్తి అయిన తర్వాత ట్యాంకర్లతో నీటి సరఫరాను నిలిపేశారు. కనీసం ఫలితాలు వచ్చేంత వరకు కూడా నీటిని సరఫరా చేయలేదు. నీటి సమస్యతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నా... ఏ నాయకుడూ పట్టించుకోవడం లేదు. గ్రామంలో పంచాయతీ బోర్లు మూడు ఉన్నాయి. అన్నింటిలోనూ అరకొరగానే నీరుంది. దీంతో ఆయా బోర్ల వద్దే నీటిని పట్టుకోవాల్సిన దుస్థితి నెలకుంది.

పశువుల తొట్టెలోని నీరే గతి

గతంలో పశువుల దాహార్తిని తీర్చడానికి గ్రామ శివారు ప్రాంతంలో నీటి తొట్టెలు ఏర్పాటు చేశారు. సమీపంలో ఉన్న బోరు నుంచి ఆ తొట్టెల్లోని నీటిని సరఫరా చేసేవారు. ప్రస్తుతం ఆ బోరులో నీరు అరకొరగా ఉండటంతో ఆ బోరు నుంచి గ్రామంలోని నీటిని సరఫరా చేయడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ బోరు పక్కనే మరో బోరు వేయించింది. దానిలో నీరు పుష్కలంగా పడ్డాయి. దీంతో ఆ బోరుకు మోటార్ కూడా బిగించారు. అయితే ఆ మోటార్ నుంచి గ్రామంలోకి వెళ్లే పైపులైన్‌కు కనెక్షన్ ఇవ్వకపోవడంతో సమస్య అలాగే ఉంది. ఆ మోటార్ నుంచి కేవలం పశువుల తొట్టెలోకి నీటిని సరఫరా చేస్తున్నారు. గ్రామస్థులు తప్పని పరిస్థితుల్లో ఆ నీటినే తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

వ్యవసాయ బోర్ల నుంచి...

గ్రామానికి దూరంగా ఉన్న బోరుబావిలో నీరు అరకొరగా వస్తోంది. ఆ నీరు ఎస్సీ కాలనీ వరకు మాత్రమే వస్తున్నాయి. మరో బోరుబావి పాత పాఠశాల వద్ద ఓ ప్లాస్టిక్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. ఆ ట్యాంక్‌లోని నీరు సమీపం నివాసముంటున్న కుటుంబాలకే సరిపోతున్నాయి. గ్రామంలో ద్విచక్రవాహనదారులు ప్లాస్టిక్ ట్యాంక్ వద్ద నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. అక్కడి నీరూ సరిపోకపోవడంతో తప్పనిపరిస్థితుల్లో వ్యవసాయ బోర్ల వద్ద వెళ్లి నీటిని తెచ్చుకొంటున్నారు. కొంతమంది రూ. 600తో ట్యాంక్ నీటిని కొని.. సంపులు నింపుకుంటున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు నీటి కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. నీటి సమస్యను పరిష్కరించాలని పంచాయతీ రాజ్ అధికారులను పలుమార్లు వేడుకున్నా... ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆ గ్రామస్థులు వాపోతున్నారు. నూతన బోరు బావి నుంచి పైపులైన్‌కు కనెక్షన్ ఇస్తే నీటిని సమస్య తీరుతుందని చెబుతున్నా.. అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు.

మూడు రోజుల్లో పరిష్కరిస్తాం

చౌటకుంటపల్లిలో నీటి సమస్య ఉన్నది వాస్తవమే. కొత్తగా బోరు వేశాం. అందులో నీరు పుష్కలంగా ఉన్నాయి. ఈ బోరు నుంచి గ్రామంలోని పైపులైన్‌కు కనెక్షన్ ఇచ్చి సమస్య పరిష్కరిస్తాం.

- శశికళ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ, నల్లమాడ



ట్యాంకరు ద్వారా తెచ్చుకున్న నీరు



పాత పాఠశాల సమీపంలోని బోరు వద్ద గ్రామస్థులు

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

కదిరి అర్బన్ : చిరంజీవి జన్మదినం సందర్భంగా పట్టణంలోని ఎన్జీవో కాలనీలో అఖిల భారత చిరంజీవి యువత, రామచరణ్ యువశక్తి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి భారీ స్పందన లభించింది. 50 మంది యువకులు ఇందులో రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటిండెంట్ హుసేన్, నాయకులు లక్ష్మణ్, మనోహర్, రాజేంద్ర, కార్తీక్, చక్రీ, సోము, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల పరిశీలన

ఓబుళదేవరచెరువు : మండలంలోని వెంకటాపురం పంచాయతీలోని నారప్పగారిపల్లి, తిప్పేపల్లి గ్రామాల్లో ఆర్డీఓ భాగ్యరేఖ అసైన్డు భూములను మంగళవారం పరిశీలించారు. అసైన్డు భూములపై అర్హులైన లబ్ధిదారులున్నారా లేదా అని స్వయంగా రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట డిప్యూటీ తహసీల్దార్ జాకీర్, వీఆర్‌ఓలు రమణ, రామాంజనేయులు, సిబ్బంది కొండప్ప ఉన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరి

బత్తలపల్లి : పాడి రైతులందరూ తమ పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని ఏడీలు శ్రీనివాసులు, గురునాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేశామన్నారు. ఈ వ్యాధి సోకిన పశువులకు తీవ్ర జ్వరం రావడం, మేయకపోవడం, నీరసించి పోవడం, పాల ఉత్పత్తి తగ్గడం, నోటిలో కాళ్లగిట్టెల్లో పుండ్లు ఏర్పడడం తదితర లక్షణాలు ఉంటాయన్నారు. దీంతో పశువులు మృత్యువాత పడే ప్రమాదముందని, కావున రైతులు పశువులకు తప్పనిసరిగా ఈ టీకా వేయించాలని సూచించారు.

ఎస్పీని కలిసిన సీఐ

పుట్టపర్తిరూరల్: గోరంట్ల అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్ సీఐగా శేఖర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి సుబ్బారాయుడు సత్యసాయి జిల్లా డీపీఓకు వీఆర్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో అనంతపురం వీఆర్‌లో ఉన్న శేఖర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కేంద్రంలో ఎస్పీ రత్నను మర్యాదపూర్వకంగా కలిశారు.



ఎస్పీతో సీఐ శేఖర్

ఆటో డ్రైవర్లకు అవగాహన

గాండ్లపెంట, ఆగస్టు 20 : రోడ్డు నియమాలపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు ఎస్ఐ క్రిష్ణవేణి మంగళవారం అవగాహన కల్పించారు. ఆటోల్లో పరిమితి సంఖ్యకు మించి తీసుకెళ్లకూడదని, ప్రతి ఒకరూ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవర్ చేయరాదని, అతివేగంగా వెళ్లకూడదని తెలిపారు. నిబంధనల ఉల్లంగిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

పులి సంచారం.. అవాస్తవం

నల్లచెరువు, ఆగస్టు 20: మండలంలోని పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి ఆలయ పరిసరాల్లో పులి సంచరిస్తోందని వస్తున్న వార్తలు అవాస్తమవని ఆలయ ఈఓ రవీంద్రరాజు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయ ఆవరణంలో 25 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, పులి సంచరించిన దాఖలాలు ఎక్కడా కనిపించలేదని అన్నారు. పులి సంచరిస్తోందని సోషియల్ మీడియాలో ప్రచార చేయడం సరికాదన్నారు. శ్రావణ మాసం శనివారాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని, భక్తులను భయపెట్టడానికే ఇలా చేస్తున్నారని, అలాంటివారిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రమశిక్షణతోనే అభివృద్ధి

నంబులపూలకుంట, ఆగస్టు 20: విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లు, క్రమశిక్షణ అలవర్చుకుంటేనే జీవితంలో అభివృద్ధి సాధ్యమని ఎస్ఐ శ్రీధర్‌బాబు తెలిపారు. స్థానిక కస్తూర్బా గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చెడు చూడడం, వినడం, మాట్లాడడం పూర్తిగా మానుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఓ పావని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


వక్క మార్కెట్ నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

ప్రజాసమస్యలు తక్షణమే పరిష్కరించాలి

● అధికారులకు జాయింట్ కలెక్టర్ అభిషేక్ సూచన

మడకశిర(అమరాపురం), ఆగస్టు 20: ప్రజాసమస్యలను తక్షణమే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్.. అధికారులను ఆదేశించారు. అమరాపురం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం జేసీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రెవెన్యూ సిబ్బందితో కలిసి భూ సమస్యలు, వన్‌బీ, అడంగళ్, మ్యుటేషన్ తదితర సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోరాదని ఆదేశించారు. హలుకూరు పంచాయతీలోని ఉదుగూరు కరియమ్మ దేవాలయం వద్ద ప్రభుత్వ స్థలాన్ని, చింతతోపు స్థలాన్ని వక్కమార్కెట్‌యార్డు ప్రాసెసింగ్ యూనిట్ కోసం పరిశీలించారు. వక్కమార్కెట్ స్థల నివేదికను సిద్ధం చేసి పంపాలని అధికారులను ఆదేశించారు. ఆయనతో పాటు తహసీల్దార్ మారుతీప్రకాష్, మండల సర్వేయర్ పద్మ, వక్క మార్కెట్‌యార్డు సెక్రెటరీ నాగేంద్రకుమార్, ఆర్ఐ మూడ్లగిరియప్ప, వీఆర్ఓ అమ్మాజమ్మ, సచివాలయ సర్వేయర్లు, మరియు తెలుగు దేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జేసీ

గుడిబండ, ఆగస్టు 20: స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని సత్యసాయిజిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వైసీపీ హయాంలో అసైన్డ్ భూములు రిజిస్ట్రేషన్ అయినవాటిపై విచారణ చేసి నివేదిక సమర్పించాలని తహసీల్దార్ కరుణాకర్‌ను ఆదేశించారు. రెవెన్యూ రికార్డులు తారుమారైతే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూ సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించి ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వెంటనే అర్జీలను పరిశీలించి సమస్య పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ రాంభూపాల్‌రెడ్డి, ఆర్ఐ మహ్మద్ బిలాల్, వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి ఆదేశాలతో రహదారికి మోక్షం

పెనుకొండ రూరల్, ఆగస్టు 20 : పట్టణానికి సమీపంలోని షీప్‌ఫాం సమీపంలో రహదారి సమస్య పరిష్కారమయ్యింది. రొద్దంకు వెళ్లే దారిలో రైల్వే అండర్‌బ్రిడ్జి కింద రోడ్డు శిథిలమయ్యింది. ఇటీవల ఈ ప్రాంతాన్ని సందర్శించిన మంత్రి సవిత మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రహదారి మరమ్మతుతో రొద్దం నుంచి పెనుకొండ వెళ్లే ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.


మరమ్మతులు పూర్తయిన రహదారి

ఆలయ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

హిందూపురం అర్బన్, ఆగస్టు 20 : పట్టణ పరిధిలోని త్యాగరాజనగర్‌లో వెలసిన ఉమా నర్మదేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడిగా అశ్వత్థనారాయణమూర్తి, శాశ్వత గౌరవాధ్యక్షుడిగా గంగాధర్, గౌరవ సలహాదారుడిగా రాజశేఖర్, అధ్యక్షుడిగా గోవిందరెడ్డి, కార్యదర్శిగా ప్రదీప్, కోశాధికారిగా శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడిగా జనార్ధన్‌రెడ్డి, అశోక్‌కుమార్, నాగేంద్రబాబు, సహాయ కార్యదర్శులుగా జయరామిరెడ్డి, వెంకటేష్, గిరిధర్, ఉపకోశాధికారిగా బుడ్డప్ప, బాబు, బద్రీ, మీడియా కోఆర్డినేటర్‌గా సాయి చరణ్‌లను ఎన్నుకున్నారు.

రెండు బైక్‌ల ఢీ - ఇద్దరికి గాయాలు

అగళి, ఆగస్టు 20 : మండల కేంద్రంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం రొళ్ల మండలం కేపీ తండాకు చెందిన మూర్తి నాయక్, జాత్రినాయక్ రొళ్ల నుంచి ద్విచక్రవాహనంలో శిర వైపు వెళ్తున్నారు. పోలీస్ స్టేషన్ నుంచి ద్విచక్రవాహనంలో ఏఎ్‌సఐ బషీర్, కానిస్టేబుల్ రామాంజనేయులు మధుడివైపు వెళ్తున్నారు. అగళి హైవే రోడ్డు నాలుగు రోడ్ల కూడలిలో రెండు వాహనాలు ఢీ కొన్నాయి. పోలీసులకు ఎటువంటి గాయాలు తగలతదే. కేపీతండా వాసులిద్దరికీ గాయాలు కావడంతో అగళి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డా.శివనంద వైద్య పరీక్షలు నిర్వహించి 108లో హిందూపురం ఆసుపత్రికి తరలించారు. మూర్తినాయక్ పరిస్థితి ఆందోళన కరంగా ఉంది. జాత్రినాయక్‌కు బలమైన గాయాలు తగిలాయని, పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ వీరేష్ పరిశీలించారు.

భారీ వర్షానికి నేలకొరిగిన మొక్కజొన్న

పెనుకొండ రూరల్, ఆగస్టు 20 : వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మొక్కజొన్న పంట నేలకొరిగింది. రొద్దం మండలంలోని పెద్దిపల్లి గ్రామానికి చెందిన రైతు అశ్వత్థరెడ్డి తనకున్న మూడెకరాల పొలంలో మొక్కజొన్న పంట సాగుచేశాడు. సోమవారం కురిసిన గాలి, వానకు మొక్కజొన్న నేలకొరిగింది. పంట దెబ్బ తినడంతో తీవ్రంగా నష్టపోయానని, వ్యవసాయాధికారులు స్పందించి నష్టపరిహారం అందించాలని రైతు కోరారు.


దెబ్బతిన్న పంటను చూపుతున్న రైతు

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి : ఎంపీడీఓ

పెనుకొండ రూరల్, ఆగస్టు 20 : ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని గుట్టూరు వైద్యాధికారి నాగరాజునాయక్, ఎంపీడీఓ శివశంకరప్ప పేర్కొన్నారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ గీత ఆధ్వర్యంలో మండలమీట్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలు శాఖల అధికారులు పాల్గొని ప్రభుత్వ పథకాలను ఎంపీటీసీ, సర్పంచ్‌లకు వివరించారు. అయితే సమావేశానికి పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు. తహసీల్దార్ శ్రీధర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 2023సంవత్సరంలో మండల వ్యాప్తంగా 15,151ఎకరాల భూమి ఫ్రీహోల్డ్ జరిగిందన్నారు. 7,150 మంది ఫ్రీహోల్డ్ రైతులున్నారన్నారు. మండలంలోని అంగన్ వాడీ కేంద్రాల్లో ఖాళీలను భర్తీ చేయాలన్నారు. హార్టికల్చర్ అధికారులు ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ పరికరాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ శాంతలక్ష్మీ, వైస్ ఎంపీపీ రామాంజినేయులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 20: మాజీ ప్రధాని రాహుల్ గాంధీ 78వ జయంతిని మంగళవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని వైఎస్ఆర్ సర్కిల్‌వద్ద మాజీ సర్పంచ్ విశ్వనాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ గంగాధర్, కేక్‌కట్‌చేసి తినిపించుకున్నారు.


కేక్ తినిపించుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

కఠిన శిక్షలతోనే మహిళలకు రక్షణ

● కోల్‌కతా వైద్యురాలి ఘటన సమాజానికే సిగ్గుచేటు ● న్యాయవాదులు, ఉద్యోగులు, విద్యార్థుల మండిపాటు


హిందూపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు


గోరంట్లలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

హిందూపురం, ఆగస్టు 20: దోషులకు కఠిన శిక్షలు విధిస్తేనే మహిళలకు రక్షణ సాధ్యమని, లేదంటే హత్యాచారాలను ఆపడం కష్టమని న్యాయవాదులు ధ్వజమెత్తారు. కోల్‌కతాలో వైద్యురాలిని అత్యాచారానికి పాల్పడి, హత్యకు చేసిన ఘటనను నిరసిస్తూ మంగళవారం పట్టణంలో న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ జూనియర్ డాక్టర్‌పై అమానుషంగా ప్రవర్తించి హత్య చేయడం దుర్మార్గమన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకులు రాజశేఖర్, శ్రీనివాసరెడ్డి, సంతోషకుమారి, కళావతి, నవేరా, పవిత్ర, మురళి, వెంకటేష్, ఉదయ్‌సింహారెడ్డి, అబ్దుల్లా, రత్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: వైద్యురాలిపై హత్యాచార సంఘటనకు నిరసనగా గోరంట్ల ఆర్డీటీ ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎస్ఎపీఎస్ ఎయిండెడ్ జూనియర్, ఏఎన్‌కె డిగ్రీ కళాశాలల విద్యార్థులు కాలేజీ వద్దనుంచి ప్రధాన రహదారిపై ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అడవాల సూర్యనారాయణ, ఆర్డీటీ ఏటీఎల్ నరసింగరావు, అధ్యాపకులు, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

పెనుకొండ : కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాకాండను నిరసిస్తూ ఆర్డీటి ఆధ్వర్యంలో పెనుకొండలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆర్డీటీ సభ్యులు, స్థానిక జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, బ్యానర్లు పట్టుకుని పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు.

మడకశిర రూరల్: వైద్యురాలి హత్యాకాండను నిరసిస్తూ కదిరేపల్లి ప్రాథమికోన్నత విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. అంగన్‌వాడీ కార్యకర్తల జిల్లా యూనియన్ నాయకురాలు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

జీఓ 117ను రద్దు చేయాల్సిందే..

● టీచర్ల సర్దుబాటుపై ఉపాధ్యాయ సంఘాల మండిపాటు ● గత ప్రభుత్వ నిర్వాకంతోనే సమస్యలని ఆగ్రహం

హిందూపురం అర్బన్, ఆగస్టు 20: గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జీఓ నెంబర్ 117ను రద్దు చేయాల్సిందేనని మున్సిపల్ ఉపాధ్యాయులు ధ్వజమెత్తారు. మంగళవారం స్థానిక ఎంఆర్‌సీలో ఎంఈఓను కలిసిన ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉపాధ్యాయ వ్యవస్థకు ప్రమాదరకరంగా మారి ప్రభుత్వ పాఠశాలలను కబళిస్తున్న జీఓ 117ను రద్దు చేయాలన్నారు. జీఓ నెంబర్ 84 మున్సిపల్ పాఠశాల ఉపాధ్యాయులను శరాఘాతంలో పడేశారన్నారు. జీఓ నెంబర్ 84 కేవలం పర్యవేక్షణ అధికారాలు మాత్రమే గత ప్రభుత్వం విడుదల చేసింది. ఉత్తర్వులు విడుదల అయి మూడు సంవత్సరాలు కావస్తున్నా ఎలాంటి పదోన్నతులు, బదిలీలు లేకుండా కాలం గడిపారన్నారు. ఇతర మేనేజ్‌మెంట్ ఉపాధ్యాయులు పదోన్నతులు, బదిలీలు పొందారని ఆవేదన చెందారు. మున్సిపల్ ఉపాధ్యాయులను ద్వితీయ శ్రేణి ఉపాధ్యాయులుగా పరిగణిస్తున్నారన్నారు. అనంతరం ఎంఈఓ గంగప్పకు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ ఉపాధ్యాయుల రాష్ట్ర కార్యదర్శి సిద్దగిరి శ్రీనివాసులు, పట్టణాధ్యక్షుడు పెన్నోబులం, కార్యదర్శులు చంద్రానాయక్ బాలకృష్ణ, జిల్లా నాయకులు జనార్ధన్, హరి సురేష్ నగేష్, కేశవరెడ్డి, ఎస్టీయూ నాయకులు గొబ్రెనాయక్, సమీవుల్లా, గంగాధర్ తదితరులు ఉన్నారు.


ఎంఈఓకు వినతి అందజేస్తున్న మున్సిపల్ ఉపాధ్యాయులు

సర్దుబాటును అడ్డుకున్న ఉపాధ్యాయ సంఘాలు

పెనుకొండ : ఉపాధ్యాయుల సర్దుబాటు అస్తవ్యస్తంగా మారిందని ఉపాధ్యాయ సంఘాలు మండిపడ్డాయి. పెనుకొండలో మంగళవారం ఈ కార్యక్రమాన్ని వారు అడ్డుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సర్దుబాటు కార్యక్రమం అప్రజాస్వామికంగా చేపడుతున్నారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం జీఓ-2ను ఆఘమేఘాలపై విడుదల చేశారని, దానిని అమలు చేయడంతో అధికారులు విఫలమయ్యారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్దుబాటు ప్రక్రియలో సీనియర్ ఉపాధ్యాయులను పరిగణనలోకి తీసుకోవడం లేదన్నారు. 2025మే30లోపు రిటైర్డ్ అవుతున్న ఉపాధ్యాయులను సర్‌ప్లస్ నుంచి మినహాయించడం లేదన్నారు. రొద్దం మండలం రాగిమేకలపల్లి పాఠశాలలో ఏడుగురు విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులున్నారని, ఉపాధ్యాయులన్నచోట సర్‌ప్లస్ చూపించలేదన్నారు. యూటీఎఫ్ నాయకులు సుధాకర్, ఏపీటీఎఫ్ అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులు, వైఎస్ఆర్‌టీఎఫ్ నాయకులు కాడిశెట్టి శ్రీనివాసులు ఖండిస్తున్నట్లు తెలిపారు.

వర్షం రాకతో పొలాలు కళకళ


పచ్చదనాన్ని సంతరించుకున్న వేరుశనగ పంట

మడకశిర టౌన్, ఆగస్టు 20: నియోజకవర్గం వ్యాప్తంగా గత వారం రోజుల నుండి ఓమోస్తారు వర్షం కురుస్తుండటంతో పంటలు పచ్చదనం సంతరించుకొని కళ కళ లాడుతున్నాయి. సోమవారం రాత్రి మండల వ్యాప్తంగా 34.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. అమరాపురం మండలంలో 38.6 మి.మీ., గుడిబండ 29.2 మి.మీ., రొళ్ల 73.4 మి.మీ., అగళి 52.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. వర్షాలుకురవడంతో వేరుశనగ పంట ఊడలు దిగేందుకు ఎంతో అనుకూలమని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో వర్షాలు కురుస్తుండటంతో పంట పొలాలన్నీ పచ్చదనాన్ని సంతరించుకొన్నాయి.

సమస్యల పరిష్కారానికి ముందుంటా

● ప్రైవేట్ పాఠశాలల పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు



నూతన కార్యవర్గంను సన్మానిస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్, ఆగస్టు 20: ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి తాను ముందుంటానని పట్టణ అధ్యక్షుడు పీఎస్ శ్రీనివాసులు హామీ ఇచ్చారు. మంగళవారం పట్టణ పరిధిలోని స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ఏర్పాటు చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా పాంచజన్య శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా ముస్తఫా, కార్యదర్శిగా వేణుగోపాల్, కోశాధికారిగా రియాజ్, ఉపాధ్యక్షుడిగా దీపు, జాయింట్ సెక్రెటరీగా నంద, ఉమ్మడి కార్యదర్శిగా రియాజ్, ఈసీ మెంబర్లుగా ప్రసాద్ జయంతిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గ్రంథాలయం తనిఖీ

అగళి, ఆగస్టు 20 : మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని మంగళవారం సత్యసాయి జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రికార్డులను గ్రంథాలయంలో పనితీరును, గ్రంధాలయ సిబ్బందిని అడిగితెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ అబ్దుల్ రహిమాన్ బాషను గ్రంథాలయ అభివృద్ధికి మూలమైన గ్రంథాలయ సెస్ వసూళ్లపై చర్చించారు. దినపత్రికలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ గ్రంథాలయాధికారి బొజ్జనాయక్ సిబ్బంది తదితరులు ఉన్నారు.


తనిఖీ చేస్తున్న జిల్లా కార్యదర్శి రమ

బేటీ బచావ్ బేటీ పడావ్ కార్యక్రమం

పెనుకొండ, ఆగస్టు 20: స్థానిక ఉర్దూ పాఠశాలలో సీడీపీఓ శాంతలక్ష్మీ అధ్యక్షతన భేటీబచాఓ, బేటీ పడాఓ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆడపిల్లలను రక్షించాలని, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ గురించి వీడియో ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణవేణి, ఉపాధ్యాయులు నాజియా బాను, అమీన, టీడీపీ నాయకులు శ్రీరాములుయాదవ్, బర్కత్, షమున్, నజీర్, వాజీద్, అహ్మద్, సూపర్‌వైజర్లు పుష్పలత, ఎఎన్ఎం పర్వీన్, నందిని, మాబున్నీసా, నాగమణి, అనిత, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ అంటు వ్యాధికాదు



పోస్టర్లను విడుదల చేస్తున్న జనజాగృతి సభ్యులు, అధ్యాపకులు

పెనుకొండ, ఆగస్టు 20: ఎయిడ్స్ వ్యాధి అంటు వ్యాధి కాదని వ్యాధిగ్రస్థుల పట్ల వివక్ష చూపరాదని కౌన్సిలర్ శివజ్యోతి సూచంచారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జనజాగృతి ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఐసీటీసీ కౌన్సిలర్ ఎయిడ్స్ వ్యాప్తి, రాకుండా తీసుకోవాల్సిన అంశాలను వివరించారు. కార్యక్రమంలో జనజాగృతి మేనేజర్ ఆంజనేయులు, శశికళ, హరిత, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దోమలను అరికడదాం

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 20: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని దోమలను అరికడదామని వైద్యసిబ్బంది పిలుపునిచ్చారు. ప్రపంచ దోమల నివారణ దినం పురస్కరించుకుని మంగళవారం స్థానిక ఆరోగ్య ఉప కేంద్రంలో వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు ఓంకార్, సిబ్బంది వెంకటసుబ్బమ్మ, రవీంద్ర, రత్నమ్మ, రాజశేఖర్, జయలక్ష్మీ, అనిత, లలిత, శ్యామల, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

గోరంట్ల : పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ శ్రుతి ఆధ్వర్యంలో వైద్యశాలనుంచి ప్రధాన రహదారిపై ప్రదర్శన జరిపారు. ఈ సందర్భంగా 1897లో డాక్టర్ సర్‌రూనాల్డురాస్ ఆడ అనాఫిల్స్ దోమలో మలేరియా పరాన్నజీవులున్నట్లు గుర్తించారని తెలిపారు. దీంతో ప్రతి సంవత్సరం ఆగస్టు 20న ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని జరుపుతున్నామన్నారు. ఈకార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి శివన్న, ఆరోగ్య విస్తర్ణాధికారి రమణ, వైద్య సిబ్బంది భాగ్యలక్ష్మీ, రసూల్, సూవర్ణదేవ్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశకార్యకర్తలున్నారు.


సోమందేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం

పెనుకొండ, ఆగస్టు 20 : పట్టణంలోని మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠంలో స్వామివారి 353వ ఆరాధనోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. మంగళవారం ఆరాధనోత్సవాల్లో భాగంగా పూర్వారాధన కార్యక్రమంలో అర్చకులు అనీల్, మేనేజర్ వరదాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం నిర్మాల్య విసర్జన, పంచామృతాభిషేకం, అష్టోత్తరపారాయణం, పాదపూజ, కనకమహాపూజ, మహామంగళహారతి, తీర్థ ప్రసాదం వినియోగం పల్లకిసేవ, భక్తి వాచకం కార్యక్రమం నిర్వహించారు. అశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


అలంకరణలో బృందావనం

రేపు ఉచిత గుండె వైద్యశిబిరం

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 20: మండల కేంద్రంలోని శ్రీసాయి హాస్పిటల్‌వారి ఆధ్వర్యంలో ఈనెల 22న ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రాఘవేంద్రకుమార్ తెలిపారు. కిమ్స్ సవేరా ఆసుపత్రుల బృందంతో గుండె నొప్పి, గుండె దడ, ఆయాసం, కళ్లు తిరగడం, గుండెల్లో మంట, ఛాతిలో బరువుగా ఉండటం నిద్రలో ఆయాసం, కాళ్ల వాపు రావడం, చెమటలు పట్టడం లాంటి సమస్యలకు వైద్య పరీక్షలు ఉంటాయన్నారు. ఈ శిబిరంలో ఉచితంగా జీఆర్‌బీ, బీపీ, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలను చేపడతామన్నారు. గురువారం ఉదయం 10గంటలనుంచి 2గంటల వరకు నిర్వహిస్తారన్నారు. టోకెన్ బుక్ చేసుకునేందుకు 9885096670కు సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎస్పీని కలిసిన సీఐ

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 20: గోరంట్ల అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన శేఖర్ మంగళవారం జిల్లా ఎస్పీ రత్నను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ సుబ్బారాయుడు జిల్లా వీఆర్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో అనంతపురం వీఆర్‌లో ఉన్న శేఖర్‌ను నియమించారు. దీంతో ఆయన జిల్లా కేంద్రంలో ఎస్పీ రత్నను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు.

23న గ్రామసభలు

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 20: మండలంలో 23న ఉపాధి హామీ పనులు ఎంపికపై గ్రామసభలు అన్ని పంచాయతీల్లో జరుగుతాయని ఏపీఓ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. 16 పంచాయతీ కేంద్రాల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది, సచివాల సిబ్బంది, పాల్గొంటారన్నారు. 2023-24 సంవత్సరానికి గాను నూతన పనుల ఎంపిక ఆమోదం జరుగుతాయని ఈ అవకాశాన్ని ఉపాధికూలీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భారత సేవారత్న పురస్కార ప్రదానం

పావగడ, ఆగస్టు 20: దశాబ్దాం కాలంగా సేవా సంకల్పంతో కర్ణాటక రాష్ట్ర వ్యాప్తంగా పలు కళాశాలలకు వెళ్లి నైతిక విలువలు, సామాజిక భద్రతపై అవగాహన కల్పిస్తున్న కీలారుల హల్లె నవీన్‌కు బారత సేవారత్న పురస్కారం లభించింది. మంగళవారం బెంగళూరులోని కన్నడ సాహిత్య పరిషత్ కువెంపు మైదానంలో చేతన ఫౌండేషన్ కర్ణాటక, వరల్డ్‌ప్రెస్‌బుక్ ఆఫ్ రికార్డు తరుపున ఈ పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ సాహిత్య వేత్త నాగేంద్రప్రసాద్, మ్యూజిక్ డైరెక్టర్ ముఖేష్, ప్రముఖ గాయని ప్రియదర్శిని రైతు కవి శంకరప్ప, తదితరులు కలిసి ఈ అవార్డును అందించి ఘనంగా సన్మానించారు.

చవితి వేడుకలకు అనుమతివ్వండి

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 20: మండలంలో వినాయక చవితి వేడుకలకు అనుమతి ఇవ్వాలని స్థానికులు ఎస్ఐ రమేష్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ ఏటా వినాయక చవితి వేడుకలను నిర్వహించడం ఆనవాయితీ అని, పట్టణంలో ఐదు రోజులు, గ్రామాల్లో మూడు రోజులు, పండగ నిర్వహిస్తామన్నారు. ఈ యేటా కూడా అలాగే అనుమతులు ఇవ్వాలని ఎస్ఐను కోరారు. దీనిపై ఎస్ఐ మాట్లాడుతూ బుధవారం సమావేశం ఏర్పాటుచేసి నియమ నిబంధనలు వెల్లడించి, అనుమతులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో స్థానికప్రజలు పాల్గొన్నారు.

9న వినాయక నిమజ్జనం

వినాయక నిమజ్జనాన్ని సెప్టెంబర్ 9న నిర్వహించాలని గ్రామపెద్దలు నిర్ణయించారు. మండల కేంద్రంలోని మెయిన్‌బజార్ వద్దగల ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ సెప్టెంబరు 7న విగ్రహాలను ఏర్పాటు చేసుకుని 9న నిమజ్జనం చేపట్టాలని నిర్ణయించారు.

ఆటో వాలాలకు కౌన్సెలింగ్

సోమందేపల్లిలోని ఆటోవాలాలకు ఎస్ఐ రమేష్ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆటోల్లో పరిమితికి మించి జనాలను తరలిస్తే చర్యలు తప్పవని, డ్రైవర్ సీట్లో ప్యాసింజర్లను కూర్చోబెడితే శిక్ష తప్పదన్నారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే ఆటోను సీజ్‌చేస్తామని హెచ్చరించారు.

ఆలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళం


కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న సంఘాల సురేష్

గోరంట్ల, ఆగస్టు 20: మండలంలోని వానవోలు గ్రామం కస్తూరి రంగనాథస్వామి ఆలయ పునర్‌నిర్మాణానికి సురేష్ రూ 50,116లు విరాళాన్ని అందించారు. కర్ణాటక రాష్ట్రం చిక్‌బళ్లాపూర్‌కు చెందిన సంగాల సురేష్ తన విరాళాన్ని అర్చకులు శ్రీధర్‌స్వామికి మంగళవారం అందించారు. దాతను కమిటీ సభ్యులు అభినందించారు. గోరంట్లలో నిర్మిస్తున్న సత్యసాయిబాబా భజన మండలికి నారసింహపల్లికి చెందిన పెయ్యాల రామలింగారెడ్డి రూ.50వేల విరాళాన్ని సభ్యులు రత్నమయ్య శెట్టికి అందజేశారు.

రాత్రి 10 తరువాత టీస్టాల్స్ బంద్

హిందూపురం అర్బన్, ఆగస్టు 20: రాత్రి పది గంటల తరువాత పట్టణంలో టీ స్టాల్స్, హోటల్‌ళ్ల మూసివేయాలని వన్‌టౌన్ సీఐ రాజగోపాలనాయుడు ఒక ప్రకటనలో ఆదేశించారు. ఇటీవల హిందూపురం ప్రాంతంలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఈవ్ టీజింగ్‌లు, చైన్ స్నాచింగ్‌ల కట్టడి కోసం ఇకపై కఠిన ఆంక్షలు చేపడ్తామన్నారు. అనవసరంగా రోడ్లపై తిరిగితే వాహనాలు సీజ్ చేసి స్టేషన్‌కు తరలిస్తామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహరకించాలని కోరారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై అవగాహన

పెనుకొండ రూరల్, ఆగస్టు 20: మండలంలోని మావటూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం ఓపెన్ స్కూల్ ప్రవేశాపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు జిల్లా సమన్వయ కర్త లాజర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోతరగతి పూర్తికాకుండానే చదువు మానేసిన యువతీ యువకులకు ఓపెన్ స్కూల్ ఓ వరం లాంటిదన్నారు. పదవతరగతి పూర్తీ కాగానే పై చదువులు చదివేందుకు ఇందులో అవకాశం ఉందన్నారు. ఈనెల 27వరకు ఫీజు చెల్లింపునకు ఆఖరి తేదీ అని. రూ.200అపరాద రుసుంతో సెప్టెంబర్ 4వరకు చెల్లించుకోవచ్చన్నారు. పదవ తరగతికి 14ఏళ్లు, ఇంటర్మీడియట్‌కు 15ఏళ్లు పూర్తీ అయి ఉండాలని సూచించారు. ఉన్నత విద్యతో ఎన్నో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని, అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రకళ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మడకశిరటౌన్ : నియోజకవర్గంలో ఓపెన్‌స్కూళ్లను బలోపేతం చేద్దామని ఓపెన్‌స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ లాజర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మార్సీ నందు ఎంఈఓ శ్రీనివాసభాస్కర్‌తో కలిసి వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈకార్యక్రమంలో ఎంఈఓ-2 నరసింహమూర్తి, మండల కోఆర్డినేటర్ ఇస్మాయిల్, ఉపాధ్యాయ సంఘం నాయకులు భూతన్న, రామకృష్ణ, చంద్రమోహన్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.